సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ⋅ 12 ⋅ జూన్ ⋅ 2025



శిథిల భవనాలతో ప్రమాదం!

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. 8లో



సాంకేతికతను జోడిస్తే..

రైతులు సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తే అధిక దిగుబడి పొందొచ్చని వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త పద్మావతి తెలిపారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వేళ పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దిశ కమిటీ సమావేశం వాయిదా

చుంచుపల్లి: ఐడీఓసీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం జరుగనున్న దిశ కమిటీ సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడిందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, దిశ కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పంటల సాగుపై అవగాహన ఉండాలి

కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): తాము చేసే సాగుపై రైతులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. చిట్టి రామవరంలో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అవసరం మేరకే రసాయనిక ఎరువులు వాడాలని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పక రశీదు తీసుకుని భద్రపర్చాలని సూచించారు. పచ్చిరొట్ట పంటలు సాగుచేయడం ద్వారా 30 శాతం వరకు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని చెప్పారు. పంటల మార్పిడితో సుస్థిర ఆదాయం పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఈఏసీ సభ్యుడు యాదగిరి, ఉద్యాన శాస్త్రవేత్త బి శివ, మండల వ్యవసాయాధికారి కరుణ, విస్తరణాధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న ఆదివాసీలు

ములకలపల్లి : అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలోని సర్వే నంబర్లు 30, 36, 39లో గల భూములను తమకే అప్పగించాలని కోరుతూ స్థానిక ఆదివాసీలు కలెక్టరేట్ వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం ములకలపల్లికి చేరింది. మంగళవారం వారు అశ్వారావుపేట నుంచి పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. మొత్తంగా 70 కిలోమీటర్ల మేర నడుస్తూ బుధవారం రాత్రికి పాల్వంచ శ్రీనివాస కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని అక్కడే బస చేశారు. అక్కడి నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని కలెక్టర్ కార్యాలయానికి గురువారం చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని ఆదివాసీలు మడకం నాగేశ్వరరావు, మడకం స్వరూప, మొడియం రమాదేవి, కొర్సా శ్రీను, కొర్సా నాగబాబు, మాడి సీతారాముడు, మడకం కన్నారావు తదితరులు తెలిపారు.

బడిగంట మోగింది..





నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

- స్కూళ్లకు చేరిన పుస్తకాలు, యూనిఫామ్
- ఏర్పాట్లు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు
- పండుగ వాతావరణంలో ప్రారంభించాలని ఆదేశాలు

కొత్తగూడెంఅర్బన్ : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల ఆవరణలు, తరగతి గదులను స్వచ్ఛ కార్మికులతో శుభ్రం చేయించారు. ఇందుకోసం వారికి జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు పాఠశాలకు రాగానే పండుగ వాతావరణం కనిపించేలా మామిడి తోరణాలు, రంగు కాగితాలతో అలంకరించాలని ఇప్పటికే డీఈఓ వెంకటేశ్వరాచారి ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే బుధవారం సాయంత్రం వరకూ కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ అలాంటి హడావిడి కనిపించలేదు. ఇక ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం అడ్మిషన్ల కోసం ప్రతీ సంవత్సరం చేసే హడావిడి ఈ ఏడాది కూడా కనిపించింది.

కొన్ని స్కూళ్లు శిథిల భవనాల్లోనే..

పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు నూతన భవనాలు నిర్మించినా.. కొన్ని స్కూళ్లు మాత్రం ఇంకా శిథిలావస్థకు చేరిన బిల్డింగ్‌ల్లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం అయినందున అలాంటి స్కూళ్లకు తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల ఎప్పుడో తరాల నాటిది. తరగతి గదులు, ఆఫీసు రూములన్నీ శిథిలావస్థకు చేరి ఉన్నాయి. పాఠశాల చరిత్ర గొప్పగా ఉన్నప్పటికీ సౌకర్యాలు లేకపోవడంతో అడ్మిషన్ల సంఖ్య ప్రతీ ఏడాది తగ్గిపోతోంది. ఈ సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత పాఠశాలల కమిటీలపై ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక చాలా పాఠశాలల్లో వంట షెడ్లు లేకపోవడంతో ఆవరణలోని చెట్ల కింద, నీడ ఉన్న చోటే మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఇలా ఎండా, వానలకు భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు.. ఇలాంటి సమస్యలు కూడా పరిష్కరిస్తే ఎక్కువ మంది పిల్లలు చేరే అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు సిద్ధం..

జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 1,618 పాఠశాలలు ఉండగా వాటిలో 84,817 మంది బాలురు, 83,928 మంది బాలికలు.. మొత్తం 1,68,745 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల యూనిఫామ్ కోసం జిల్లాకు 2.56 లక్షల మీటర్ల క్లాత్ రాగా ఇప్పటికే కుట్టడం పూర్తయి పాఠశాలలకు చేరుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో(డీఈఓ పరిధి) చదివే 62,532 మంది విద్యార్థులకు గురువారం పాఠశాలలు ప్రారంభం కాగానే ఒక్కో జత చొప్పున యూనిఫామ్ అందించనున్నారు. ఇక జిల్లాకు 5,08,400 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,46,374 గోదాంలకు చేరాయి. ఇందులో 4,32,576 పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశామని అధికారులు వెల్లడించారు.

పండుగ వాతావరణంలో ప్రారంభించాలి



పాఠశాలలను పండుగ వాతావరణంలో పునఃప్రారంభించాలి. విద్యార్థులు బడికి రాగానే ఆహ్లాదం కలిగేలా ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఏర్పాట్లు చేయాలి. మొదటి రోజే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్నాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

భద్రాద్రి రామయ్యకు వైభవంగా జ్యేష్ఠాభిషేకం

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం వైభవంగా జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. ప్రతి ఏడాది ఏరువాక పౌర్ణమి రోజున దేవస్థానంలో ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. తొలుత పవిత్ర గోదావరి నది నుంచి తీర్థబిందెను తీసుకొచ్చిన అర్చకులు.. బేడా మండపంలో ఏర్పాటు చేసిన 81 కలశాల్లో సమస్త నదీ జలాలను ఆవాహన చేశారు. స్వామివారికి మొదట పంచామృతంతో, ఆ తర్వాత 81 కలశాల్లో ఆవాహన చేసిన నదీ జలాలతో జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమశాలలో యాగం నిర్వహించారు. దేశంలో వరుణ దేవుడి కరుణా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, తద్వారా దేశం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుతూ పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం స్వామివారికి హారతి సమర్పించారు.



శ్రీ సీతారాముల వారికి జ్యేష్ఠాభిషేకం చేస్తున్న అర్చకులు

కాగా, జ్యేష్ఠాభిషేకం సందర్భంగా బుధవారం రద్దు చేసిన రామయ్య నిత్య కల్యాణం గురువారం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు వేద పండితులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చుంచుపల్లి/చంద్రుగొండ : భూ సమస్యలు పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. చుంచుపల్లి మండలం ఎన్కే నగర్, చంద్రుగొండ మండలం తిప్పనపల్లి, వెంకటియాతండా గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఒకటి, రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతులు, ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు కృష్ణ, సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, కార్యదర్శి ఇందిర తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్


ఉల్లాస్ యాప్‌పై శిక్షణ

చుంచుపల్లి: జిల్లాలో అక్షరాస్యతను పెంచే ప్రణాళికలో భాగం ప్రతీ పది మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఉల్లాస్ యాప్‌లో వివరాలు నమోదు చేసేలా సీసీలు, ఏపీఎంలకు ఐడీఓసీలో బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే చేయాలని, స్కూళ్లు, కాలేజీల డ్రాపౌట్లను కూడా గుర్తించి ఓపెన్ స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది అరుంధతి, సుజాత, పాపారావు, రంగారావు, నాగజ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 3వ తేదీన ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి తెలిపారు. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 105 మంది విద్యార్థులకు గాను 61 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన వివిధ శాఖల జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

బడి.. జ్ఞాపకాల ఒడి



బడంటే సంతోషం.. హాస్టలంటే భయం



బూర్గంపాడు: పాఠశాల ప్రారంభం రోజే మళ్లీ సెలవులు ఎప్పుడొస్తాయనే లెక్కలు వేసుకుంటూ వెళ్లేవాళ్లం. నెలన్నర రోజుల వేసవి సెలవుల తర్వాత పాఠశాలకు వెళ్లడం సంతోషంగానే ఉండేది. కానీ అప్పట్లో హాస్టల్‌లో అన్నంలో పురుగులు, నీళ్ల చారు తలుచుకుంటేనే ఏడుపొచ్చేది. ఆ రోజుల్లో ఉపాధ్యాయులు పాఠాలు చక్కగా చెప్పేవారు. సరిగా చదవకుంటే తన్నులు తప్పేవి కావు. ఎర్రుపాలెం మండలం కేసిరెడ్డిపల్లిలో నాలుగో తరగతి వరకు, ఆ తర్వాత హాస్టల్‌లో ఉంటూ ఎర్రుపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి వరకు చదివా. ఇప్పుడు విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలి.

– వేల్పుల బాబూరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అన్నయ్య ప్రోత్సాహంతోనే..



కొత్తగూడెం అర్బన్: పాఠశాలలో చేర్పించడానికి మా నాన్న తీసుకెళ్తే పారిపోయా. ఈ విషయం తెలిసి మా అన్నయ్య నన్ను వెదికి పట్టుకుని బడిలో అడ్మిషన్ ఇప్పించడమే కాక ప్రతిరోజూ వెళ్లేలా చూసేవాడు. అన్నయ్య ప్రోత్సాహంతోనే చదువుకుని ఈ స్థాయికి చేరా. నల్లగొండ టౌన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదవగా, ఆతర్వాత ఎంఏ పూర్తి చేశా. విద్యాశాఖలో ఉద్యోగం సాధించి డీఈఓ స్థాయికి చేరడంతో విద్యారంగంలో జిల్లాను ముందుంచేలా కృషి చేస్తున్నా. విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఇష్టంతో చదువుతూ లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధనకు కృషి చేయాలి.

– ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాశాఖాధికారి

ఇష్టంతో కష్టపడి చదివాం..



బూర్గంపాడు: ప్రస్తుత కరకగూడెం మండలంలోని చిరుమళ్ల నుంచి సుమారు 80 కి.మీ. దూరంలోని బూర్గంపాడుకు వెళ్లి చదువుకున్న రోజులు జీవితంలో ఎన్నో పాఠాలను నేర్పాయి. అక్కడ హాస్టల్‌లోనే ఉన్నా.. సెలవులు వచ్చినప్పుడు, తిరిగి బడికి వెళ్లేటప్పుడు కాలినడకన చెప్పులు లేకుండా అంతదూరం వెళ్లేవాడిని. చదువుపై ఇష్టంతో వాగులు, వంకలు దాటి పుస్తకాలు మోసుకుంటూ తిండీతిప్పలు లేకుండా వెళ్లడంతో మరింత కసిగా చదివా. వేసవి సెలవుల తర్వాత బడికి వెళ్తుంటే స్నేహితులు, ఉపాధ్యాయులను కలుస్తున్నామనే సంతోషం వేసేది. బూర్గంపాడులో 6 – 10వ తరగతి వరకు చదివిన రోజులు ఉన్నత లక్ష్యాలకు బాటలు వేశాయి. అప్పట్లోనే ఓయూలో ఎంఏ, ఎంఫిల్ చేశాక డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చినా కాదనుకుని రాజకీయాల్లోచేరి బూర్గంపాడు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఖమ్మం జెడ్పీ చైర్మన్‌గా ప్రజలకు సేవ చేశా. ఇప్పుడు పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నందున విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువు కొనసాగించి సమాజహితం కోసం పాటుపడాలి.

– చందా లింగయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్

అన్నయ్య సైకిలెక్కి వెళ్లేవాడిని..

ఇల్లెందు: మా అన్నయ్య, అక్కయ్య తోడుగా ఉండడంతో పాఠశాలలకు వెళ్లడానికి భయపడే పరిస్థితి రాలేదు. స్వగ్రామమైన ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 1 – 10వ తరగతి వరకు చదివా. నాన్న సాయిలు అటెండర్, అమ్మ సుశీల గృహిణి. అక్క జయ, అన్న విజయ్‌కుమార్‌తో కలిసి స్కూల్‌కు వెళ్లేవాడిని. మా అన్నయ్య సైకిల్‌పై తీసుకెళ్లేవాడు. మూడో తరగతి తర్వాత స్నేహితులు, టీచర్లు గుర్తు ఉన్నారు. మా స్కూల్ రోజుల్లో విరామ సమయాన సత్తుపిండి పెట్టేవాళ్లు. టెన్త్ వరకు యూనిఫాం, షూ లేవు. పాఠశాలల్లోనూ విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్లు ఉండేవి కావు. ఇప్పుడు పాఠశాలల్లో సకల సదుపాయాలు ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థాయికి చేరొచ్చు. నేను డిగ్రీ వరంగల్‌లో చదవగా ఓ సదస్సుకు హాజరైన ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ ఉపన్యాసంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. ఓయూలో పీజీ పూర్తి చేశాక 2009లో గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతూ తొలుత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా, ఆ తర్వాత కమర్షియల్ ట్యాక్స్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యా. 2012లో మళ్లీ గ్రూప్ – 2 రాసి మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యాను.



బాల్యంలో స్నేహితులు, టీచర్‌తో శ్రీకాంత్(సర్కిల్‌లో)



– సీహెచ్ శ్రీకాంత్, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి

డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

కొత్తగూడెంఅర్బన్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్‌ఎస్) ప్రొఫెసర్ డాక్టర్ శివకామి ముత్తుస్వామి, హైదరాబాద్ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి పాల్గొని గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ సేవల గురించి వివరించారు.

రోటోసిల్ వ్యాక్సిన్ ప్రారంభం..

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పీహెచ్‌సీలో రోటోసిల్ వ్యాక్సిన్‌ను డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల్లో విరేచనాల నివారణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. వ్యాక్సిన్‌ను తగిన మోతాదులో షెడ్యూల్ ప్రకారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు తేజశ్రీ, స్వప్న, జి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

ఆదివాసీలకు అండగా ఉంటాం

ఎస్పీ రోహిత్‌రాజు భరోసా

చర్ల: ఇంతకాలం మావోయిస్టుల చేతిలో నలిగిపోయి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఆదివాసీలకు అండగా ఉంటామని ఎస్పీ రోహిత్ రాజు హామీ ఇచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో మండలంలోని 20 గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినీ మల్టీపర్పస్ మిల్లులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న మావోయిస్టులు వారికి తీవ్ర నష్టం కలిగించారని, విద్య, వైద్యం, రహదారులు, కమ్యూనికేషన్ వంటి సౌకర్యాలు అందకుండా అభివృద్ధికి దూరంగా ఉంచారని అన్నారు. ఇంతకాలం తర్వాత అయినా మావోయిస్టుల ఆగడాలను వ్యతిరేకిస్తూ ఆదివాసీలు అభివృద్ధిని కోరుకోవడం హర్షణీయమని వ్యాఖ్యానించారు. ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని, ఇప్పటివరకు చదువుకుని ఖాళీగా ఉంటున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉపాధి అవకాశాలను చూసుకోవాలని సూచించారు. తమ శాఖ ద్వారా కూడా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే విప్ప నూనె తీసే మిల్లులను కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, అన్ని గ్రామాలకు రహదారులు, విద్య, వైద్యం వంటి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇకపై ఎవరూ మావోయిస్టులకు సహకరించొద్దని కోరారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఓఎస్డీ జి.నరేందర్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ మిల్లును ప్రారంభించిన ఎస్పీ, అధికారులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు..

భద్రాచలంఅర్బన్ : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. బుధవారం ఆయన ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారినికి కృషి చేయాలన్నారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ నరేందర్, టౌన్ సీఐ నాగరాజు, ఎస్ఐలు స్వప్న, రామకృష్ణ, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

జేష్ఠ మాస పౌర్ణమి(ఏరువాక పౌర్ణమి) సందర్భంగా జిల్లా రైతులు బుధవారం సాగు పనులను మొదలుపెట్టారు. ఉదయమే పశువులు, నాగళ్లు, ట్రాక్టర్లతో పొలాలకు చేరుకుని పూజలు చేశారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో పీఏసీఎస్ చైర్మన్ మందడపు సుధాకర్ పలువురు రైతులతో కలిసి పూజలు చేయడంతో పాటు మహిళలకు సారె పెట్టి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. నీటి సంఘం మాజీ చైర్మన్ మాధవరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, బాలు తదితరులు పాల్గొన్నారు. ఇక నేలకొండపల్లి తదితర మండలాల్లో కూడా రైతులు దుక్కులు దున్ని సాగు పనులు మొదలపెట్టారు. – రఘునాథపాలెం

ఏరువాక సాగారో...



క్లుప్తంగా

నవజాత శిశువుకు చికిత్స



చికిత్స పొందిన చిన్నారి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో బరువు తక్కువగా ఉన్న నవజాత శిశువుకు చికిత్స అందించారు. గత ఏప్రిల్ 27న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం పందరాజపల్లికి చెందిన శాంతకుమారికి తక్కువబరువుతో బిడ్డ జన్మించింది. దీంతో ఎస్ఎన్సీయూలో చేర్పించి వైద్యం 40 రోజులపాటు వైద్యం అందించారు. ఆస్పత్రిలో చేరినప్పుడు శిశువు కేవలం 900 గ్రాములు మాత్రమే ఉండగా, చికిత్స పొందాక బరువు 1400 గ్రాములకు చేరింది. దీంతో తల్లిండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ వైద్యలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇదే చికిత్సకు ప్రైవేటు ఆస్పత్రిలో అయితే రూ. 20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు.

126 మందికి జరిమానా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కోర్టులో బుధవారం 126 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజ మల్లు తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్, టూ, త్రీటౌన్, ట్రాఫిక్, సుజాతనగర్, పాల్వంచ, చంద్రుగొండ, చుంచుపల్లి, ములకలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టి మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా, నేరం రుజువు కావడంతో మొత్తం 126 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విద్యలో మేటి.. మాంటిస్సోరి

మణుగూరు టౌన్: ఏజెన్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని మణుగూరులోని శ్రీ సత్య భాస్కర హైస్కూల్, మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు. కేరళ, మహారాష్ట్ర, ఒడిశాలకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్, అధునాతన తరగతి గదులతో బోధన సాగుతోందని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయి మొదటి, రెండు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు.

నర్సింగ్ విద్యకు కేరాఫ్.. అరోరా

పాల్వంచ: అందరికీ అందుబాటులో ఉండేలా నర్సింగ్ విద్యను అందుబాటులో తీసుకొచ్చామని అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల చైర్మన్ తాళ్లూరి హరిబాబు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నామని, ఆరోగ్య సంరక్షణ రంగంలో ముఖ్యపాత్రపోషించే నర్సింగ్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. అత్యాధునిక ల్యాబ్‌లతో జీఎన్ఎం(జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ) కోర్సు అందిస్తున్నామని తెలిపారు. తమ సేవలకు ఫలితంగా ఇటీవల డాక్టరేట్ పురస్కారం లభించిందని పేర్కొన్నారు.

విద్యాకుసుమం.. లిటిల్ ఫ్లవర్స్

భద్రాచలంటౌన్: విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేలా లిటిల్ ఫ్లవర్స్ స్కూల్, కళాశాలలు పట్టుగొమ్మల్లా నిలుస్తున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వర ప్రసాద్, మాగంటి రమేష్‌బాబు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో 46 ఏళ్లుగా ఉత్తమ విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఏటా ఎన్నో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని, ఉత్తమ బోధన అందిస్తున్నామనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

శిథిల భవనాలతో ప్రమాదం!

- వర్షాకాలంలో కూలిపోయి నష్టం జరిగే అవకాశం
- కొత్తగూడెంలో 42 భవనాలకు నోటీసులు జారీ
- పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు పట్టణాల్లో ఇంకా గుర్తింపు దశలోనే..





శిథిలావస్థకు చేరిన కొత్తగూడెంలోని ఎక్సైజ్ కార్యాలయం, (ఇన్‌సెట్) శిథిలావస్థలో ఉన్న ఇల్లు

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలకు ప్రమాదం పొంచి ఉంది. మున్సిపాలిటీ పరిధిల్లోనే ఇలాంటి భవనాలు ఎక్కువగా ఉన్నాయి. భారీవర్షాలు ఎడతెరపి లేకుండా కురిస్తే వర్షపు నీటికి నాటి కూలే పోయే అవకాశం ఉంది. ఎలాంటి నష్ట మూ జరగకుండా ఉండాలంటే మున్సిపల్ అధికారులు, భవనాల యజమానులు అప్రమత్తమై మరమ్మతులు చేయించుకోవడం, ప్రమాదకరంగా భవనాలను పూర్తిగా తొలగించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. జిల్లాలో కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్‌లో కొత్తగూడెం పట్టణంలో మాత్రమే శిథి లావస్థలోని భవనాల యజమానులకు టౌన్ ప్లానింగ్ అధి కారులు నోటీసులు జారీ చేశారు. కార్పొరేషన్‌లోని పాల్వంచతో పాటు ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట మున్సి పాలిటీల్లో సంబంధిత అధికారుల్లో ఇప్పటివరకు చలనంలేదు.

కొత్తగూడెంలో 42 భవనాలకు నోటీసులు..

జిల్లా కేంద్రంలో నేతాజీ మార్కెట్, సూపర్‌బజార్ ఏరియా, మేదరబస్తీ ఏరియా, పాత కొత్తగూడెంలోని ఎస్సీ కాలనీలలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కార్పొరేషన్ అధికారులు ఇటీవల 42 భవనాలను గుర్తించి, యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇచ్చిన గడువులోగా భవనాలకు మరమ్మతులు చేయించుకోకపోయినా, కూల్చివేయకపోయినా మున్సిపల్ అధికారులు వాటిని తొలగించే అవకాశం ఉంది. పాతకొత్తగూడెంలోని ఎస్సీ కాలనీలో ఏటా వర్షాకాలంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వానలు కురిసే సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నుంచి ప్రజలను పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. కాగా ఇళ్ల యజమానులు వాటిని తొలగించకపోవడంతో ఎప్పుడో ఏం జరుగుతుందో తెలియన ప్రజలు భయాందోళన చెందుతుంటారు. ఈ ఏడాది వర్షాలకు పాతకొత్తగూడెం, నేతాజీ మార్కెట్‌లోని ఇళ్లు కూలే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కొత్తగూడెం పాత మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరగా, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నారు. రైటర్‌బస్తీలోని ఎక్సైజ్ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరింది. ఇల్లెందు మున్సిపాలిటీలో శిథిలావస్థలో ఉన్న భవనాలను, ఇళ్లను అధికారులు గుర్తిస్తున్నారు. పాల్వంచ మున్సిపాలిటీలో పోలీసు క్వార్టర్స్‌లో కొన్ని శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించారు. ఆయా భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. మణుగూరు, అశ్వారావుపేట మున్సిపాలిటీలలో కూడా నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

వర్షాకాలానికి ముందే గుర్తించాల్సి ఉన్నా..

అధికారులు శిథిల భవనాలను వర్షాకాలానికి ముందే గుర్తించి కూల్చివేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం నెల ముందుగానే నోటీసులు జారీ చేయని, అప్పటికీ యజమానులు స్పందించకపోతే తొలగింపు చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ జిల్లాలో కొత్తగూడెంలో తప్ప ఎక్కడ కూడా ఇప్పటివరకు నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి చేయలేదు. క్రమంగా వర్షాలు పెరిగి ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తినష్టం కూడా జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతు చేయించుకోవాలి

కొత్తగూడెం, పాల్వంచలో పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లకు మరమ్మతులు చేయించుకోవాలి. వర్షాలు మొదలయితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. యజమానులు పట్టించుకోకపోతే మున్సిపల్ నిబంధనల ప్రకారం సిబ్బంది భవనాలను తొలగిస్తారు.

–సుజాత, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాల్వంచరూరల్: కారు ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పాల్వంచ మండలం జగన్నాథపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గాయపడిన వారిని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ ప్రమాదంపై పోలీసు కేసు నమోదు కాలేదు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

కేంద్ర పథకాలు గిరిజనులకు అందేలా కృషి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు ఏపీఓ డేవిడ్ రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ఆ శాఖ డిప్యూటీ సెక్రటరీ గణేష్ నాగరాజన్ రాష్ట్రంలోని డీడీ, డీటీడీఓలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. గిరిజన కుటుంబాలకు ధర్తీ అభ, జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ తదితర పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లోని 130 గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 30 వరకు గ్రామసభలు ఏర్పాటు చేస్తామని, పీవీటీజీ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అన్ని గుర్తింపు కార్డులు ప్రతి కుటుంబంలో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

టీజీ-ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ ఈసీఈటీ) ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉండగా, తమ కళాశాల ప్రాంగణంలో 17నుంచి 19వ తేదీ వరకు జరిగే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఆతర్వాత 17 నుండి 21వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇస్తే, 25వ తేదీన సీట్లు ఖరారవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

పాల్వంచరూరల్: యువతి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

సాంకేతికతను జోడిస్తే అధిక దిగుబడి



రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు

కూసుమంచి: రైతులు వ్యవసాయంలో సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.పద్మావతి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని భగవత్‌వీడులో రైతులకు బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఖరీఫ్ పంటల సాగులో ఆధునిక పద్ధతులు, వరి నూతన వంగడాలు, వాటితో ఉపయోగాలను వివరించడమే కాక కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త అక్షిత్, ప్రోగ్రాం అసిస్టెంట్ నరేష్, ఏఓ వాణి పాల్గొన్నారు.

బంక్‌లోకి దూసుకెళ్లిన లారీ



పెట్రోల్ బంక్‌లోకి దూసుకొచ్చిన లారీ

అశ్వారావుపేటరూరల్: డ్రైవర్ నిర్లక్ష్యంతో బుధవారం ఓ లారీ అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలం వినాయకపురం వద్ద గల భారత్ పెట్రోల్ వద్ద ఆగి ఉన్న ద్విచక్రవాహనదారుడిపైకి లారీ దూసుకెళ్లింది. దీంతో అప్రమత్తమైన ద్విచక్రవాహనదారుడు బత్తుల కృష్ణ బైక్‌ను అక్కడే వదిలేసి త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. కృష్ణది ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి కాగా, వినాయకపురంలో జేసీబీలను అద్దెకు తిప్పుతున్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు కాగా, బంక్ లోపలికి దూసుకెళ్లి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఇద్దరు గిరిజనుల అరెస్ట్

దుమ్ముగూడెం: మండలంలోని గడ్డోరగట్ట గ్రామ అటవీప్రాంతంలో ట్రెంచ్ కొడుతుండగా అడ్డుకున్న ఇద్దరుగిరిజనులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని కోర్టులో రిమాండ్ చేశారు. పోడుభూముల్లో అటవీశాఖ సిబ్బంది వేసిన ప్లాంటేషన్‌ను గడ్డోరగట్ట గ్రామానికి చెందిన గిరిజనులు నరికివేశారు. దీనిపై హైకోర్టులో కేసునడుస్తోంది. కాగా బుధవారం ఎఫ్‌డీఓ సుజాత ఆధ్వర్యంలో ట్రెంచ్ కొట్టేందుకు వెళ్లిన సిబ్బందిని అడ్డగించి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు రేంజర్‌కమల తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శోభన్, ఎఫ్ ఎస్ఓ నందా, బీట్ అధికారి వీరేందర్ పాల్గొన్నారు.

ఇద్దరికి పాము కాటు

గుండాల: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరిని పాముకాటు వేసిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో బుధవారం జరిగింది. సింగారం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు చేను పనికి వెళ్లగా పాముకాటు వేసింది. అడవిరామారం గ్రామానికి చెందిన పాయం సువర్ణ కూడా చేను పనికి వెళ్లగా పాము కరిచింది. బాధితులను ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్య

టేకులపల్లి: మండలంలోని చింతోనిచెలక తండాకు చెందిన బానోత్ హత్తీరాం (50) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య ఇరానీ పుట్టింటికి వెళ్లిది. మంగళవారం మధ్యాహ్నం హత్తీరాం కూడా వెళ్లి ఇంటికి రావాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బోడు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిపై బుధవారం పోలీసులు కేసు నమోదుచేశారు. బోడు ఎస్ఐ పి. శ్రీకాంత్ కథనం ప్రకారం.. బర్లగూడెం గ్రామానికి చెందిన పూనెం జోగయ్య(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడి భార్య, కూతురు కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. దీంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత నెల 31న పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

ములకలపల్లి: మైనర్ బాలికను వంచించి గర్భవతిని చేసిన ఘటనలో బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు మరో గ్రామానికి చెందిన కాక వేణుతో పరిచయం ఏర్పడగా, మభ్యపెట్టి లోబరుకున్నాడు. యువతి గర్భవతి కావడంతో విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత మొహం చాటేశాడు. ఈ నెల 7న బాలిక అనారోగ్యానికి గురికాగా పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో గర్భందాల్చినట్లు తేలింది. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి రామవరం ఆస్పత్రికి తరలించగా, గర్భంలోని శిశువు మృతిచెందినట్లు గుర్తించి, తొలగించారు. కుటుంబీలకు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచ: బాలికను బలవంతంగా బైక్‌పై తీసుకెళ్లిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక పాత పాల్వంచ సాయినగర్‌లో గత నెల 27న కిరాణా షాపునకు వచ్చిన 16 బాలికను అదే ఏరియాకు చెందిన కుంచాల పవన్ బలవంతంగా మోటార్ సైకిల్‌పై తీసుకెళుతుండగా గమనించిన బాలిక అన్న సాయితేజ్ అడ్డుకున్నాడు. దీంతో పవన్ తోపాటు విజయ్ ప్రవీణ్‌లు అనే వ్యక్తులు కలిసి సాయితేజతో గొడవ పడి దాడి చేశారు. మంగళవారం అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జీవన్ రాజ్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్లు స్వాధీనం

పాల్వంచ: పాల్వంచలో పలు హోటళ్లు, కర్రీ పాయింట్లు, రెస్టారెంట్లలో డీటీ సుంకరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేశారు. సబ్సిడీపై అందించిన వంట గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ వ్యాపారాల్లో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 35 సిలిండర్లను స్వాధీనం చేసుకుని 12 మందిపై 6ఎ కేసులు నమోదు చేశారు. వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సుజాతనగర్: వ్యవసాయ విద్యుత్ మోటార్‌ను చోరీ చేసిన ముగ్గురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సింహసాగర్ గ్రామానికి చెందిన లావుద్యా తులసీరాం పొలంలోని విద్యుత్ మోటార్ గత నెల 8న చోరీకి గురైంది. బాధిత రైతు గత నెల 26న ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం ఎస్ఐ రమాదేవి, సిబ్బందితో కలిసి నర్సింహసాగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించారు. దీంతో విద్యుత్ మోటార్‌ను చోరీ చేసి, సుజాతనగర్ గ్రామ శివారులో ఉన్న స్క్రాప్ దుకాణ యజమాని కోమారి అప్పారావుకు రూ.3 వేలకు విక్రయించినట్లు తెలిపారు. దీంతో వారితోపాటు మోటార్‌ను కొనుగోలు చేసిన అప్పారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.

టీజీఏఎన్‌బీ-'మా' సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్' అధికారికంగా ప్రారంభించారు. ఇది తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, సివిల్ ఫోర్స్ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన వినూత్న కార్యక్రమమని టీజీఏఎన్‌బీ తెలిపింది. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మాదాల రవి, టీజీఏఎన్‌బీ ఎస్పీ పి.సీతారామ, డిపార్ట్‌మెంట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ డైరెక్టర్ శైలజ తదితరులు హాజరయ్యారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే తమ లక్ష్యం దిశగా ఇది ఒక శక్తివంతమైన అడుగు అని వారు పేర్కొన్నారు.

25న పోలవరంపై ప్రధాని 'ప్రగతి' సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ నెల 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణతోపాటు సంబంధిత రాష్ట్రాలకు తాజాగా కేంద్రం సమాచారాన్ని అందించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఏపీ సర్కారుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం మేరకు నీళ్లను నిల్వ చేస్తే తమ రాష్ట్రాల్లో ఏర్పడనున్న ముంపు సమస్యను పరిష్కరించాలని, భూసేకరణతో పాటు పరిహారం చెల్లించాలని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని తెలంగాణతో సహా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో ప్రధాని మోదీ గత నెల 28న ఈ ప్రాజెక్టుపై ప్రగతి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అప్పట్లో వాయిదా పడింది. తాజాగా ఈ నెల 25న నిర్వహించనున్నట్టు కేంద్రం తెలిపింది.

పాతికేళ్లకు వృద్ధ భారతం!

▶ మొదటి పేజీ తరువాయి

రెట్టింపునకు మించి 34.7 కోట్లకు (జనాభాలో 20.8 శాతం) చేరుకుంటుందని అంచనా. ఇది దేశ ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటికే దేశంలో ఆర్థిక అభద్రత, కుటుంబపరమైన సహాయ సహకార వ్యవస్థ క్షీణత, వైద్య, ఆరోగ్య సేవల విషయంలో అసమానతల పెరుగుదల లాంటి తదితర కారణాల వల్ల వృద్ధుల సంఖ్య పెరుగుదల అనేది ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక అంశాలను ప్రభావితం చేస్తుండటం చర్చనీయాంశంగా ఉంది. భారత్ క్రమంగా వృద్ధ సమాజంగా మారనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది ఒక సంక్షోభంగా పరిణమించవచ్చుననే హెచ్చరికలు కూడా ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ: ద ల్యాండ్ స్కేప్ టుడే'- గివ్ గ్రాంట్స్ ఇండియా' నివేదిక'లో ఇందుకు సంబంధించిన అనేక అంశాలు వెల్లడయ్యాయి. ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 (యూఎన్ఎఫ్‌పీఏ ఇండియా, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సంయుక్త పరిశీలన), కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ పరిశోధనల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

29 శాతం మందికే పెన్షన్

పెన్షన్ అందని వృద్ధుల బతుకు భారంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలోని వృద్ధులలో 29% మందికే పెన్షన్ (వివిధ రూపాల్లో) లభిస్తోంది. దాదాపు 40% మంది వృద్ధులు అత్యల్ప ఆదాయ వర్గ కుటుంబాలకు చెందినవారు. వారి జీవితం.. భద్రమైన ఆదాయం, కుటుంబ మద్దతు తగ్గిపోతున్న ఈ కాలంలో మరింత కష్టతరంగా మారుతోంది. వృద్ధులపై జరిగే దౌర్జన్యాలలో 71% కేసులు మహిళలకు సంబంధించి ఉంటున్నాయి. దేశంలోని సగానికి పైగా వృద్ధులు మొబైల్ ఫోన్లు లేదా ఇంటర్నెట్ ఉపయోగించలేరు. ఇది వారిని సమాజం నుంచి పూర్తిగా వేరుచేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కు పైగా మాత్రమే వృద్ధుల వసతి గృహాలున్నాయి.


దెబ్బతీస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు...

ప్రస్తుతం వృద్ధులలో..50% మందికి అధిక రక్తపోటు, 43% మందికి మధుమేహం (డయాబెటిస్) 33% మందికి ఆస్తమా వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరమయ్యే పరిస్థితులు. కానీ దేశవ్యాప్తంగా తక్కువ సంఖ్యలో మాత్రమే గెరియాట్రిక్ వైద్య నిపుణులున్నారు. పౌర ఆరోగ్య బీమా పథకం ద్వారా 25% వృద్ధులకు మాత్రమే బీమా లభిస్తోంది.

వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు

అటల్ వయో అభ్యుదయ యోజన, జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, రాష్ట్రీయ వయోశ్రీ పథకం. అయితే వీటిపై ప్రజల్లో అవగాహన లోపం, ఇవి సరిగా అమలు కాకపోవడం, గ్రామీణ ప్రాంతాలకు చేరిక తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి.

అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వృద్ధుల శాతం ఇలా ఉంది..



(ఉత్తరాది, ఈశాన్య భారత్‌లోని చాలామటుకు రాష్ట్రాల్లో 11 శాతానికి పైగా వృద్ధుల జనాభా ఉన్నట్టు తెలుస్తోంది)

ఏం చేయాలి?

పెన్షన్ వ్యవస్థను విస్తరించాలి. అసంఘటిత రంగం వృద్ధులకు కూడా చేరుకునేలా చూడాలి. అత్యాధునిక వృద్ధుల నివాస గృహాలు స్థాపించాలి. సహాయ జీవన, ఆరోగ్య ఆధారిత సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జీరో టాలరెన్స్ పథకం – వృద్ధులపై దౌర్జన్యాలపై కఠినచర్యలు. డిజిటల్ సహిత వృద్ధులు – డిజిటల్ సాంకేతికతపై శిక్షణ. వృద్ధ మహిళల ప్రత్యేక పథకాల కు, ఆర్థిక స్వయం సాధన, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి.

వానలకు అనుకూలంగా వాతావరణం

▶ మొదటి పేజీ తరువాయి

మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మాటూర్‌లో 4.93 సెం.మీ. వర్షం

బుధవారం రాష్ట్రంలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 11 రోజుల్లో 3.37 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. బుధవారం సాయంత్రానికి 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాటూర్‌లో 4.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లిలో 4.35, నల్లగొండ జిల్లా ముదిగొండలో 3.38, పడమటిపల్లెలో 3.10, తిమ్మాపూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

తొలగించిన కులాలపై ముగిసిన విచారణ

- ప్రభుత్వానికి త్వరలో బీసీ కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ జాబితా నుంచి గతంలో తొలగించిన కులాల చేర్పునకు సంబంధించి బీసీ కమిషన్ బహిరంగ విచారణ బుధవారంతో ముగిసింది. మూడురోజుల పాటు జరిగిన ఈ విచారణలో మొత్తం 133 గ్రూపులతో కమిషన్ మాట్లాడింది. బుధవారం జరిగిన విచారణలో 64 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, రంగు బాలలక్ష్మి, ఇతర అధికారులు ఈ విచారణలో వచ్చిన వినతులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ రాష్ట్ర బీసీ కుల జాబితానుంచి 26 కులాలు తొలగించారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని కులాలు కావడం, తెలంగాణలో ఆయా కులాలు స్థానికంగా లేకపోవడంతో అప్పట్లో వాటిని తొలగించారు. అయితే ఈ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని కమిషన్‌కు వినతులు రావడంతో ఈ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ త్వరలో ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

కూకట్‌పల్లిలో హాట్‌కేకుల్లా..

గజం భూమి ధర రూ.2.98 లక్షలు
- కేపీహెచ్‌బీ కాలనీ స్థలాలకు భారీ స్పందన
- రూ.141.36 కోట్లు పలికిన 18 ప్లాట్‌లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలాలకు బుధవారం ఏర్పాటు చేసిన వేలం పాటలో భారీ స్పందన లభించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని 7వ ఫేజ్‌లోని 18 ప్లాట్లను వేలం వేయగా అన్ని ప్లాట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోయాయి. 7వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 22ను అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షల చొప్పున దక్కించుకున్నారు. 151 గజాలున్న ఈ ప్లాట్ 4 కోట్ల 52 లక్షల 72 వేల 160 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అదే విధంగా 292 గజాలు ఉన్న 19వ నంబర్ ప్లాట్ గజానికి రూ.2.88 లక్షల చొప్పున వేలకు వేలం పాడారు. ఈ ప్లాట్ నుంచి 8 కోట్ల 40 లక్షల 96 వేల రూపాయలు వచ్చాయి. ఇక్కడ ఉన్న మొత్తం 18 ప్లాట్‌లలోని 6,236.33 గజాలకు కలిపి 141 కోట్ల 36 లక్షల 89 వేల 100 రూపాయల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి
- కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్‌కౌశిక్, వేణుయాదవ్, వరలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ బీసీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలని ఆర్.కృష్ణయ్యకు హితవు చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో విడుదల చేయకపోతే గాంధీభవన్‌ను ముట్టడిస్తామని బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్ కౌశిక్, వేణుయాదవ్, మచ్చ వరలక్ష్మిలు మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ఈ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కానీ ఈ విషయంలో ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి అని, బీజేపీలో ఉండి ఆయన బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక జీవో విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య మాట్లాడుతున్నారని, ఆ జీవోను కోర్టు కొట్టి వేస్తే, బీజేపీ ఎంపీగా ఉన్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్ల గురించి కేంద్రంతో మాట్లాడి 9వ షెడ్యూల్‌లో పెట్టిస్తారా? అని సవాల్ చేశారు. 40 ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్లను ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని, ఈ విషయాన్ని కృష్ణయ్య ఒప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్ఎల్‌బీసీ పనులపై ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే

- టన్నెల్ ప్రాంతంలో నేల స్వభావాన్ని కచ్చితంగా గుర్తించే ప్రయత్నం
- రక్షణ శాఖ హెలికాప్టర్లతో సర్వే నిర్వహిస్తాం: మంత్రి ఉత్తమ్



వీరేంద్ర తివారీతో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టన్నెల్ ప్రాంతంలోని నేల స్వభావాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ప్రత్యేక హెలికాప్టర్లతో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే చేయించాలని నిర్ణయించింది. అందుకోసం తక్కువ ఎత్తులో ఎగిరే సామర్థ్యం గల రక్షణ శాఖకు చెందిన రెండు హెలికాప్టర్లు వినియోగించనున్నారు. సర్వే పరికరాలను డెన్మార్క్ నుంచి ప్రత్యేకంగా తెప్పించనున్నారు. ఈ సర్వేపై బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సీఈ అజయ్‌కుమార్‌లు నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ వీరేంద్ర తివారీ, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ డీజీగా పనిచేసిన హర్‌పాల్‌సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాలతో విడివిడిగా భేటీ అయ్యారు. టన్నెల్ పునరుద్ధరణ, సర్వే, నిర్మాణ పనులపై వారితో చర్చించారు. సర్వే కోసం రెండు ప్రత్యేక హెలికాప్టర్లను ఇవ్వాలని కోరగా, రక్షణ శాఖ అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రో మ్యాగ్నటిక్ పరికరాలతో జరిపే సర్వే భూ ఉపరితలం నుంచి ఒక కిలోమీటర్ లోతు వరకు నేల స్వభావంతో పాటు ఇతర సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా నిర్మాణ పనులు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. జూలై 12న సర్వే మొదలై వారం రోజుల్లో పూర్తవుతుందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో టన్నెల్ పనులను పూర్తిచేసి కృష్ణా జలాలను గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. టన్నెల్ పనుల పూర్తికోసం కల్నల్ పరీక్షిత్ మెహ్రా డిప్యుటేషన్‌పై రెండేళ్లపాటు సాగునీటి శాఖలో స్పెషల్ సెక్రటరీ హోదాలో పనిచేస్తారని చెప్పారు. టన్నెల్ తవ్వకాల్లో అపార అనుభవం ఉన్న జనరల్ హర్పాల్ సింగ్ తెలంగాణ ప్రభుత్వానికి జీతం తీసుకోకుండా గౌరవ సలహాదారుగా సేవలు అందిస్తారని వివరించారు.

ఎరువులు, విత్తనాల విషయంలో అప్రమత్తత అవసరం: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: కేటాయించిన లక్ష్యానికన్నా తక్కువ మొత్తంలో సరఫరా చేసిన యూరియా, ఇతర ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలని ఎరువుల కంపెనీల ప్రతినిధులను వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సచివాలయంలో అధికారులు, ఎరువుల కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జూన్‌కు కేటాయించిన 1.70 లక్షల మెట్రిక్ టన్నులతో పాటు ఇప్పటివరకు తక్కువగా సరఫరా చేసిన 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలన్నారు. కేటాయించిన ఎరువులను సరఫరా చేయకపోతే ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరి సాగుకు ఈసారి సన్న రకాల విత్తనాలు, పౌరసరఫరాల శాఖ కొనుగోలుకు అనువుగా ఉండే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి తుమ్మల.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి సూచించారు.

జిల్లా వార్తలు

విపత్తులు ఎదుర్కోవడంపై శిక్షణ



మాట్లాడుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: గతేడాది మాదిరి మున్నేటి ముంపు ఎదురైతే సహాయక చర్యల్లో పాల్గొనేలా ఖమ్మంలో పలువురిని ఆపదమిత్రలుగా నియమించారు. వీరికి ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి ఆర్.మాధిలేటి ఆధ్వర్యాన విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, సహాయక చర్యలు చేపట్టడం, సీపీఆర్‌తో పాటు ప్రాథమిక చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు సాయినాథుడి నాణేల ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: షిర్డీ సాయినాథుడికి సంబంధించి తొమ్మిది నాణేలను ఖమ్మం గాంధీచౌక్‌లోని సాయి మందిరంలో గురువారం ప్రదర్శించనున్నట్లు చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. షిర్డీ సాయినాథుడు భగవంతుడిని చేరేందుకు తొమ్మిది నాణేలను రూపొందించి భక్తురాలైన లక్ష్మీబాయికి అందించినట్లు నమ్మిక. ఈ నాణేలను షిర్డీలోని లక్ష్మీబాయి సమాధి వద్ద ఉంచగా, ఆమె బంధువులు దేశ వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో ప్రదర్శిస్తున్నారు. ఈమేరకు గురువారం ఖమ్మం చేరుకుంటారని వెంకటేశ్వరరావు తెలిపారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగంగా పూర్తిచేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. కామేపల్లి మండలంలోని గరిడేపల్లిలో ఇటీవల మృతి చెందిన బోడా బిబ్లి దశదినకర్మకు హాజరైన ఆయన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఈమేరకు త్వరగా పూర్తిచేసుకుంటే బిల్లులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, వెంకటనర్సయ్య, ధరావత్ రాంజీ, బానోత్ మత్రునాయక్, గుగులోత్ గోపి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంచేలా వ్యాపారం

- మహిళా మార్ట్‌ను సందర్శించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మార్ట్‌లో కొనుగోలు చేసిన వస్తువులు తీసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల్లో విశ్వాసం పెరిగేలా మహిళా సంఘాలు వ్యాపారం నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని మహిళా మార్ట్‌ను బుధవారం సందర్శించిన ఆయన నిర్వహణలో అనుభవాలు, ఇంకా ఏమైనా సాయం కావాలి అని ఆరా తీశాక మాట్లాడారు. వినియోగదారుల అవసరాలు, ఆలోచనలకు అనుగుణంగా ఉత్పత్తులు సమకూరిస్తే వ్యాపారం పెరుగుతుందని తెలిపారు. కల్తీలేని నాణ్యమైన పదార్థాలు తక్కువ ధరకు మహిళా మార్ట్‌లో లభిస్తాయనే నమ్మకం ఏర్పర్చాలని చెప్పారు. ఏమేం అమ్మాలన్న విషయాన్ని జిల్లా మహిళా సమాఖ్యలో నిర్ణయించుకుని, వచ్చే లాభాలతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మార్ట్‌కు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ కలెక్టరేట్ నుంచి అందిస్తామని కలెక్టర్ చెప్పారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ బ్యాగ్స్ మాత్రమే వాడాలని సూచించారు. అనంతరం ఆయన కొంత సామగ్రి కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించారు.

■ ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలించాక ఆయన భద్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీహెచ్.స్వామి, డీటీ అన్సారీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

■ ఖమ్మంవన్‌టౌన్: బాల కార్మికరహిత జిల్లాగా ఖమ్మంను తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఈనెల 12న బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడమే కాక బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా పని ప్రదేశం వద్ద ఎక్కువ మంది పిల్లలు ఉంటే అక్కడే పాఠశాల ఏర్పాటు చేయిస్తామన్నారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ భారతీరాణి, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డీఎల్‌సీఓ విజయభాస్కర్‌రెడ్డి, బాలల పరిరక్షణాధికారి విష్ణువందనతో పాటు ఉదయ్‌భాస్కర్, కె.శ్రీనివాస్, రవీందర్, రాందాస్, రవిచంద్ర, సమీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

భద్రాచలంటౌన్: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటూ అందివచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా ఉద్యోగాల సాధన సులువవుతుందని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ తెలిపారు. టీఎస్‌కేసీ, ఐటీసీ ప్రథం సంయుక్తంగా కళాశాలలో నిర్వహించిన ఒకేషనల్, ఎలక్ట్రికల్ నైపుణ్యాలపై 45 రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. అలాగే, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను సన్మానించారు. కాగా, భద్రాచలం ప్రభుత్వ కళాశాలలో చదివి కేయూ నుంచి రెండు బంగారు పతకాలు సాధించిన భాను ప్రనూషను సైతం ప్రిన్సిపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ హవీలా, అధ్యాపకులు హిమజ, డాక్టర్ శ్రీను, డాక్టర్ నాగ సమీర, శరణ్య, నర్సింహారావు, బలరాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పెంచి కార్మికుల వేతనం, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. ఇదే సమయాన ఉపాధ్యాయులు బాధ్యతగా తల్లిదండ్రులను కలిసి పిల్లలను చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజుతో పాటు ముత్తయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎస్‌జీఎఫ్



మొక్క నాటుతున్న ఎస్‌జీఎఫ్ బాధ్యులు

టేకులపల్లి: ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యాన టేకులపల్లి మండలం బొమ్మనపల్లిలో బుధవారం హరిత హారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం హెచ్ఎం మంగీలాల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈకార్యక్రమంలో పొగాకు లక్ష్మి, జర్పుల పద్మ, లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, ఎం.జ్యోతిరాణి, నీరజా షారోన్, సరోజ, పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కూసుమంచి: కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన రైతు దుస్సా ముత్తయ్య (55) బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక ఏటి ఒడ్డున పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు షాక్ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతోకేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

జారి పడిన పెయింటర్...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా బోనకల్ వాసి, ఖమ్మం వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న పెయింటర్ గంధం వంశీ(30) బుధవారం ప్రమాదవశాత్తు జారి పడగా మృతి చెందాడు. ఇంట్లో ఆయన ఫోన్ మాట్లాడుతూ నీళ్ల గమనించక కాలు వేయడంతో జారి పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై మృతి చెందగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

వారి నిర్ణయం స్ఫూర్తిదాయకం

- కుమార్తెను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించిన ఉపాధ్యాయ దంపతులు



పాఠశాల వద్ద కుమార్తె, ఉపాధ్యాయులతో కృష్ణ దంపతులు

ఇల్లెందురూరల్ : ఆ దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. తమ కుమార్తె ఉన్నతంగా చదువుకోవాలనే ఆకాంక్షతో గతేడాది ఖమ్మంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధిస్తారనే విశ్వాసంతో ఈ ఏడాది రెండో తరగతిలో సర్కారు బడిలో చేర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మస్సివాగు గ్రామానికి చెందిన ఊకె కృష్ణ, రామేశ్వరి దంపతులు గుండాల మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారి కుమార్తె నమశ్విత ఖమ్మంలోని ప్రైవేట్ స్కూల్‌లో చదువుతుండగా ఈ ఏడాది బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇల్లెందు మండలంలోని ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్పొరేట్ స్కూల్‌లో చదివించే ఆర్థిక స్తోమత ఉన్నా.. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కృష్ణ – రామేశ్వరి తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ముత్తారపుకట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవి హర్షం వ్యక్తం చేశారు.

'రైతులను ఆందోళనకు గురిచేస్తున్న కేంద్రం'



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రైతాంగాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. ఈ విషయాన్ని రైతాంగం గుర్తించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రథమ సభ ఖమ్మంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. దేశ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేలా కేంద్రప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. తద్వారా వ్యవసాయం నుంచి రైతులను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇక ఆపరేషన్ కగార్ పేరుతో పేరుతో ఆదివాసీలను అమానుషంగా హత్య చేస్తున్నారని తెలిపారు. ఇంకా సంఘం తెలంగాణ అధ్యక్షుడు రంగయ్య, సీనియర్ నాయకుడు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరరావు, ఒగ్గు నాగిరెడ్డి మాట్లాడారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు సహా 18 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఊరు దాటించిన 'స్నాప్‌చాట్'

- వచ్చాక ముఖం చాటేసిన యువకుడు
- లైంగికదాడికి యత్నించిన మరో వ్యక్తి

రఘునాథపాలెం: స్నాప్‌చాట్ ద్వారా ఏర్పడిన పరిచయంతో ఓ వివాహిత కుమార్తెతో సహా జిల్లా దాటి రాగా.. పరిచయం ఉన్న యువకుడు ముఖం చాటేశాడు. ఈ విషయాన్ని అదునుగా తీసుకున్న ఇంకో వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఇది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన వివాహితకు స్నాప్‌చాట్ ద్వారా ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆయన ఆహ్వానంతో ఆమె నాలుగేళ్ల కుమార్తెతో కలిసి మంగళవారం రాత్రి ఖమ్మం బస్టాండ్‌కు చేరుకుంది. ఆపై యువకుడు చెప్పిన అడ్రస్ ప్రకారం రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం రాగా, యువకుడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో చేసేదేం లేక ఆమె గ్రామ బస్టాప్ వద్దే ఉండిపోయింది. ఈక్రమాన అర్ధరాత్రి 12 గంటలకు ఖమ్మం బస్టాండ్‌కు వెళ్లేందుకు యత్నిస్తుండగా ఒక ద్విచక్రవాహనదారుడు సానుభూతి చూపుతూ బైక్‌పై తీసుకెళ్లి కొద్ది దూరం వెళ్లాక రోడ్డు పక్కకు ఆపి లైంగికదాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయగా వాహనదారుడు వెలుగుమట్ల కాలనీ వైపు పారిపోయాడు. అదే సమయాన వచ్చిన ఆటో డ్రైవర్ సాయంతో బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. వివాహితను పిలిపించింది ఎవరు, బైక్‌పై తీసుకెళ్లింది ఎవరనే కోణంలో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.